క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు


ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నియామకం కావడంతో పట్టణంలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్య కుమార్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నియామకంతో పార్టీలో నూతన ఉత్తేజం వస్తుందన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ముద్రగడను నియమించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, గోళ్ల నాగేశ్వరరావు, కావలి శ్రీనివాసరావు, ముద్రగడ వీరేంద్ర, పతివాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

ఏలేశ్వరం: పట్టణంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు రెండోరోజు ఆదివారం హోరాహోరీ సాగాయి. స్థానిక కంబాలపాలెం కాలనీలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో యువకులు హోరాహోరీగా తలపడుతున్నారు. పోటీల్లో చైతన్యనగర్, లింగంపర్తి, పేరవరం, ఒమ్మంగి, ధర్మవరం జట్లు తలపడ్డాయి. సోమవారం పోటీలు ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గుమ్మాల రాంబాబు, నీలపల్లి నాగు, ఎద్దు కుమారస్వామి, గుమ్మాల కుమారస్వామి, కోనాల లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ గౌరవాధ్యక్షుడు సోమరాజు

ఏలేశ్వరం: పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించాలని మండల పెన్షనర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు అన్నారు. స్థానిక సంఘ భవనంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సంఘ సభ్యులకు ప్రభుత్వం ద్వారా వచ్చే బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, సాల్మన్‌రాజు, చెన్నాప్రగడ సత్యగాంధీ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా ఉడత రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా వాసా పుల్లయ్య, కార్యదర్శిగా అలమండ బీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా జి.విల్సన్‌బాబు, కోశాధికారిగా మజ్జి తాతారావు, మహిళా కార్యదర్శిగా స్వర్ణ కుమారి, మహిళా సంయుక్త కార్యదర్శిగా చిల్లా రేవతిలను ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహాల శుభ్రత


సిరిపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ శ్రేణులు

ఏలేశ్వరం: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సిరిపురంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పిలుపు మేరకు మండల ప్రోగ్రాం ఇన్‌చార్జ్ పాహెట్టి లోవరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలను పార్టీ శ్రేణులు నీళ్లతో కడిగి శుభ్రం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాల వద్ద దీపారాధన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలవ్యాప్తంగా ఆయన విగ్రహాలను శుభ్రం చేయడంతో పాటు దీపారాధన చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలుగూరి హరేరామ్, సాగి బంగార్రాజు, చిటికెల తాతారావు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- పరాయి పంచన గ్రంథాలయాలు
- వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు




గోకవరంలో పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం (అంతర చిత్రం) ఇరుకు గ్రంథాలయంలో పాఠకుల కోసం సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

గోకవరం: మండలంలోని గ్రంథాలయాల పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా మారింది. ఏళ్లతరబడి స్థల సమస్య కారణంగా అంగన్‌వాడీలకు సొంత భవనాల నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పుడు స్థలం సమస్య తీరినప్పటికీ జిల్లా గ్రంథాలయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో సొంత భవనాల నిర్మాణం కలగానే మిగిలింది. మండలంలో గోకవరం, మల్లవరం గ్రామాల్లో గ్రంథాలయాలు ఉన్నాయి. గోకవరంలో పంచాయతీ కార్యాలయం వెనుక పంచాయతీ భవనంలో, మల్లవరంలో అంగన్‌వాడీకి సంబంధించిన భవనంలో ఈ గ్రంథాలయాలు నడుస్తున్నాయి.

35 ఏళ్లుగా..

గోకవరంలో సుమారు 35 ఏళ్ల నుంచి పలు అద్దె భవనాల్లో గ్రంథాలయం నడిచింది. ప్రస్తుతం ఉన్న భవనం చిన్నదిగా ఉండటంతో పుస్తకాలు ఉంచేందుకే సరిపోవడం లేదు. దీంతో గ్రంథాలయానికి ఒకేసారి పది మంది పాఠకులు వస్తే వారు ఉండేందుకు వీలుండదు. దీంతో రానురాను గ్రంథాలయానికి వచ్చే వారి సంఖ్య తగ్గుతూ ఉంది. గతంలో రోజుకు సుమారు వంద మంది పాఠకులు గ్రంథాలయానికి వచ్చేవారు, ప్రస్తుతం ఈ సంఖ్య పదుల సంఖ్యకు పడిపోయింది. దీంతో గ్రంథాలయాధికారి, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ, స్థానిక నాయకులు గ్రంథాలయానికి సొంత స్థలం ఉంటే భవనం నిర్మాణానికి గ్రంథాలయం శాఖ నిధులు మంజూరు చేస్తారని తద్వారా నూతన భవనం సమకూరుతుందని రెవెన్యూ శాఖ అధికారులు దృష్టికి తీసకువెళ్లారు. దీనిపై స్పందించిన రెవెన్యూ శాఖ అధికారులు సుమారు ఎనిమిదేళ్ల క్రితం పంచాయతీ కార్యలయం వెనుక గ్రంథాలయానికి సుమారు నాలుగు సెంట్ల స్థలం కేటాయించారు. దీంతో త్వరలోనే గ్రంథాలయం నూతన భవనం నిర్మాణం జరుగుతుందని పాఠకులు ఆశపడ్డారు. మల్లవరంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధుల చొరవ తీసుకుని గ్రంథాలయానికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఆయా గ్రంథాలయాలకు స్థలాలు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు. దీంతో గ్రంథాలయ నూతన భవనాల నిర్మాణం కలగా మిగిలిపోయింది. నూతన భవనం నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందని ఆశపడ్డ పాఠకులకు తీవ్ర నిరాశ ఎదురైంది.

విద్యార్థులకూ అవస్థలు

ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. విద్యార్థులకు గ్రంథాలయాల్లో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహించే క్రమంలో వసతుల లేమి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు వెంటనే స్పందించి గోకవరం, మల్లవరం గ్రంథాలయాలకు నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు.

నూతన భవనం నిర్మించాలి



మల్లవరంలో గ్రంథాలయం సొంత భవనానికి స్థానిక ప్రజాప్రతినిధులు మూడు సెంట్లు భూమిని కేటాయించారు. కానీ గ్రంథాలయశాఖ అధికారులు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి గ్రంథాలయ భవనం నిర్మించాలి.

– పైల కల్యాణ్, మల్లవరం

స్థలం సేకరించినా అద్దె భవనంలోనే...

గోకవరం గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి స్థలం సేకరించాం. కానీ భవనానికి నిధులు కేటాయించకపోవడంతో అద్దె భవనంలోనే గ్రంథాలయం నడుస్తుంది. ఒకేసారి పది మంది పాఠకులు వస్తే కూర్చొనేందుకు వీలుకుదరడం లేదు. అధికారులు స్పందించి గ్రంథాలయానికి భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– బద్దిరెడ్డి మెహర్‌బాబా, గోకవరం

ఇంద్ర ధనస్సు కనువిందు


ఆదిత్యలో కనువిందు చేసిన ఇంద్ర ధనస్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం ఓ అద్భుత దృశ్యం కనువిందు చేసింది. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న జాతీయ పతాకం చుట్టూ విరిసిన ఇంద్ర ధనస్సు చూపరులను ఆకట్టుకుంది. ఇంద్ర ధనస్సు ఎంత ఆకర్షించినా జాతీయ జెండా ముందు దాని అందం చిన్నబోయింది. కాగా జాతీయ జెండా చుట్టూ అల్లుకుని జెండా గౌరవాన్ని పెంచిందని ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

లంపకలోవ హైస్కూల్‌లో వృత్తి విద్యా కోర్సులు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ (వృత్తి విద్యా) కోర్సులు నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్.రాజేష్ తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు 8వ తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో 9వ, 10వ తరగతులతో పాటుగా వృత్తివిద్యా కోర్సులు కొనసాగుతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశం పొందాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఏలేశ్వరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 2009–10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని ఒకరికొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని మురిసిపోయారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దాడి సూరిబాబు, అడపా రామకృష్ణ, వేణుగోపాలరావు, సుబ్బారావు, రాజారావు, కోటేశ్వరరావు, సాయి, బాష్యం, సుభాసిణి, శేషకుమారి, ఉమామహేశ్వరి, పద్మ, ప్రకాశరావులకు పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఏలేశ్వరం: వారంతా కలిసి చదువుకుని ఏళ్లు గడిచింది. అప్పటికి ఇప్పటికి వారిలో మార్పువచ్చినా వారి జ్ఞాపకాల్లో మార్పు రాలేదు. దీంతో ఎప్పుడు తమ స్నేహితులను కలుసుకోవాలనే ఆతృతతో ఉన్నా వారందరికీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికైంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 2004–06 బ్యాచ్ ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎకనామిక్స్ అధ్యాపకులు సీహెచ్ సత్యగాంధీ, సివిక్స్ అధ్యాపకుడు పలివెల శివాజీ, కామర్స్ అధ్యాపకుడు వాగు మాధవ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుకుని ఉన్నత స్థితిలో విద్యార్థులు ఉండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు నాని, సత్యరామ్, వీరబాబు, దుర్గాప్రసాద్, అయ్యప్ప, సీతారామ్,జ్యోతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అధికారం ఖాయం


యర్రవరంలో పార్టీ శ్రేణులతో నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- యర్రవరంలో పర్యటన

ఏలేశ్వరం: రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని యర్రవరంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మాజీ సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టేందుకు పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, గంగాధర్, నానాజీ తదితరులు పాల్గొన్నారు. రౌతులపూడి మండలం గంగవరంలో కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకలక్ష్మి, పార్టీనాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని రథసేవ


ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథోత్సవం

అన్నవరం: ఆదివారం పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి టేకు రథంపై ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిన అనంతరం పండితులు రథసేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చాటన మధ్య, మంగళ వాయిద్యాల నడుమ మూడుసార్లు రథంపై ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. వేద పండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రసాద్ దంపతులు రూ.2,500 చెల్లించి రథసేవలో పాల్గొన్నారు. వారికి స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం ఇచ్చి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అర్చక స్వాములు కంచిభట్ల సాయిరాం, నిట్టల కామేశ్వరరావు, పరిచారకుడు కొండవీటి రాజా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు సత్యదేవునికి ముత్తంగి సేవ

సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు (ముత్తంగి సేవ) ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉక్కపోతతో విలవిల

తొండంగి: ఎండలు, ఉక్కపోతతో ఆదివారం ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో పాటు ఉక్కపోత వాతావరణం నెలకొంది. దీనికి తోడు అడపా దడపా విద్యుత్ కోతలు విధించడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?


కోటనందూరు బస్టాండ్ సెంటర్లో నిలిచిపోయిన ట్రాఫిక్

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ ట్రాఫిక్ దిగ్బంధంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులతో పాటు స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తుని, నర్సీపట్నం పట్టణాల మధ్య ప్రధానమైన సెంటర్ ఇది. అనకాపల్లి–కాకినాడ జిల్లాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజలు ఈ బస్టాండ్ కేంద్రంగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సెంటర్ రోజంతా ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఆటోవాలాలు, వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించేసి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. దశాబ్దాలుగా ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యకు అధికారులు తీసుకుంటున్న తాత్కాలిక చర్యలతో పరిష్కారం లభించడం లేదు. అధికారులు ట్రాఫిక్ సమస్య మూలాలపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోపక్క ఈ సెంటర్‌లో వ్యాపారం చేసుకునే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు, నివాసితులు రాత్రివేళ రోడ్డును అధ్వానంగా మారుస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నుంచి కలుషిత నీరు, ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. రోడ్డుపై చేరిన నీటితో దుర్వాసన వెదజల్లడంతో పాటు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దుస్థితిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

- గ్రామాల్లో క్రైస్తవుల ర్యాలీలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


తొండంగి చర్చిలో మట్టలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


గోకవరంలో ఈత మట్టలతో ర్యాలీ


హంసవరంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

తుని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. హంసవరం ఆరోగ్యమాత దేవాలయం చర్చ్ ఫాదర్ బాల శౌరీ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతర ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఒకరికొకరు మట్టల ఆదివారం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సర్పంచ్ రాయి మేరీ అవినాష్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: శ్రమకాల దినాలను పురస్కరించుకుని క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెం లూథరన్ చర్చి నుంచి బాలాజీ చౌక్, మెయిన్ రోడ్డు మీదుగా మట్టలతో ర్యాలీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ క్రీస్తుమార్గాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచశాంతి నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్ డేవిడ్‌రాజు, వీసీసీ సభ్యులు సుమలత, త్రిమూర్తులు, వత్సలరావు, పేకలజాన్, సుజాత, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ఎల్ఎఫ్‌టీఎల్ బాప్టిస్ట్ చర్చి, హోప్ ఫౌండేషన్ మినిస్ట్రీస్ తదితర క్రైస్తవ సంస్థలు ఏసుక్రీస్తు యేరుషలేం నగర ప్రవేశాన్ని గుర్తుచేసుకుంటూ క్రీస్తు శ్రమల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ఎల్ఎఫ్‌టీఎల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్లు జి.ఆనందరావు, జాన్ శామ్యూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సంఘ సభ్యులు పూలతో అలంకరించిన మట్టలను చేతపట్టి ప్రత్తిపాడు పుర వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. మెయిన్ రోడ్డు, ఎంప్లాయిస్ కాలనీ, ఇందిరా కాలనీల మీదుగా ర్యాలీ కొనసాగింది. శాంతి నినాదాలు చేస్తూ ప్రపంచశాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు.

గోకవరం: మండలంలోని మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పరిశుద్ధ యోహోను లూథరన్ చర్చి సభ్యులు ఈత మట్టలకు పువ్వులు అలంకరించి జయజయ గీతాలు ఆలపిస్తు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు వారా జాషువా మాట్లాడుతూ లూథరన్ చర్చిలోని సుమారు 300 మంది క్రైస్తవులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్టు తెలిపారు. పేరిష్ డెలిగేట్ మాండ్రు ప్రేమ్ కుమార్, ఆర్డినేటివ్ గెలిగేట్ జి. ప్రసన్న కుమార్, మెప్పెల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొండంగిలో క్రైస్తవులు మట్టలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే బెండపూడి, పెరుమాళ్లపురం, అద్దరిపేట, దానవాయిపేట, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల్లో క్రైస్తవులు మట్టలతోర్యాలీలు నిర్వహించారు. చర్చిల్లో ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ధర్మవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. యర్రవరం వైపు నుంచి అన్నవరం వైపు వెళ్తున్న కారు ధర్మవరం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.